క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: స్థానిక సంజీవయ్యనగర్‌లో అగ్నిప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. కాగా శుక్రవారం బాధితులు బాతు కుమారి, డొంకా రఘుపతిమ్మలను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి, స్థానిక నాయకులు పరామర్శించి రూ.5 వేలు నగదు, బియ్యం, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, పార్టీ నాయకులు సుంకర వీరబాబు, తోలేటి రాంప్రసాద్, బద్దిరెడ్డి మెహర్ బాబా, మచ్చా మోహన్ పాల్గొన్నారు.

సాగునీటి జలాశయాల్లోకి చేప పిల్లలు



తిరుమాలి పెరుమాళ్ల చెరువులో చేప పిల్లలను వేస్తున్న అధికారులు

ఏలేశ్వరం: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనలో భాగంగా శుక్రవారం సాగునీటి జలాశయాల్లోకి చేప పిల్లలను వదిలిపెట్టారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏలేరు జలాశయంలోకి సుమారు 2.10 లక్షల చేప పిల్లలను వదిలారు. మండల పరిధిలోని ఐదు చెరువుల్లో సుమారు 1.21 లక్షల చేపపిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. మత్స్యకారుల ఉపాధి నిమిత్తం ఏలేరు ప్రాజెక్టులో చేపపిల్లలను పెంచుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, సూతి ప్రసాద్, ఏడీ లావణ్య, ఎఫ్‌డీఓలు ఉప్పాడ శ్రీరామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ రాజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



కత్తిపూడిలో లక్ష బిల్వార్చన పూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం అయ్యప్ప భక్తులు లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు లక్ష బిల్వార్చన, పడి పూజ చేశారు. గ్రామం అయ్యప్పనామ స్మరణతో మార్మోగింది. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న వేషధారణలు



ఎస్.పైడిపాలలో అలరించిన వేషధారణలు

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాల గౌరీదేవీ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రదర్శించిన వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ పగటి వేషాలను జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినిదివాణం, వైఎస్సార్ సీపీ నాయకుడు రాయి ప్రసాద్ ప్రారంభించారు. మల్లేలు, కోయదొరలు, జంగమదేవర, బుడబుక్కలు, గంగిరెద్దు బృందం, మాయల ఫకీరు, శక్తివేషాలు ధరించి విరాళాలు సేకరించారు. ఈ విరాళాలతో అమ్మవారి ఉత్సవాలను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ.

జోరుగా సేవా కార్యక్రమాలు



జగ్గంపేట సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేస్తున్న ఎస్సై నాగార్జునరాజు


జగ్గంపేట: గ్రామానికి చెందిన పురాణపండ సత్యనారాయణమూర్తి హరికుసుమాంబ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలోని యాచకులకు భోజనం ప్యాకెట్ల పంపిణీ చేశారు. అలాగే కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు, పాలు వితరణ చేశారు. ట్రస్టు ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ట్రస్టు నిర్వాహకులు పురాణపండ శేషసాయి శర్మ తెలిపారు. జగ్గంపేట ఎస్సై రోగులకు పండ్లు, పాలు అందజేశారు.

వర్షాభావం.. సాగుకు దూరం

- రబీలో పంపా ఆయకట్టుకు నీరు ఇవ్వలేమని ప్రకటించిన ప్రభుత్వం
- పంపా, ఏలేరు రిజర్వాయర్లలో నీరు లేకపోవడంతో ఈ నిర్ణయం
- రబీ సాగుపై ఆశలు వదులుకున్న రైతులు



పంపా రిజర్వాయర్‌లో తగ్గిన నీటి నిల్వలు



పంపాలో 90 అడుగులకు పడిపోయిన నీటిమట్టం

అన్నవరం: ఈ ఏడాది వర్షాభావం పరిస్థితులు సాగుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. వర్షాలు లేకపోవడంతో మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్‌లో వరి సాగుకు దూరమయ్యారు. అన్నవరం పంపా రిజర్వాయర్ కింద తుని, పత్తిపాడు నియోజకవర్గాల్లోని 12,005 ఎకరాల ఆయకట్టులో ఈ ఏడాది రబీ సాగుకు ప్రభుత్వం విరామం ప్రకటించింది. ఏలేరు రిజర్వాయర్‌లో సైతం తగినంత నీటి నిల్వలు లేకపోవడంతో రబీలో పంపా ఆయకట్టుకు నీరిచ్చే పరిస్థితి లేదు. దీంతో ఈ ఏడాది పంపా ఆయకట్టుకు రబీలో నీరు ఇవ్వడం లేదని ఏలేరు ఇరిగేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీవీ రామగోపాల్ శుక్రవారం తెలిపారు. గత నాలుగేళ్లలో పంపా ఆయకట్టుకు రబీ సైతం సమృద్ధిగా నీటిని సరఫరా చేశారు. ఏటా రబీ సీజన్‌లో ఏలేరు రిజర్వాయర్ నుంచి పంపాకు నీరు విడుదల చేసి ఆయకట్టుకు వదిలేవారు.

ఈ ఏడాది ఖరీఫ్ ఆలస్యం కారణంగా...

గత ఐదేళ్లగా పంపా రిజర్వాయర్‌లో నవంబర్ మూడో వారం నాటికి వంద అడుగులకు తగ్గకుండా నీటిమట్టం ఉండేది. ఒకవైపు పంపాలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ఏలేరు, పుష్కర నుంచి నీరు విడుదల చేసేవారు. దీంతో డిసెంబర్ రెండో వారం వరకు ఖరీఫ్‌కు నీరు విడుదల చేసినా నీటిమట్టం తగ్గేది కాదు. డిసెంబర్‌లో రెండు వారాలు విరామం ఇచ్చి మళ్లీ నాలుగో వారంలో రబీకి నీరు విడుదల చేసేవారు. గత నాలుగేళ్లుగా ఖరీఫ్, రబీ పంటలకు పుష్కలంగా నీటిని అందించారు. ఈ ఏడాది పంపా పరివాహక ప్రాంతమైన శంఖవరం, రౌతులపూడి మండలాల్లో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో పంపా రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గిపోయింది. ఏలేరు, పుష్కర కాలువల ద్వారా పంపాకు నీటిని విడుదల చేసి ఖరీఫ్‌కు నీరు ఇస్తున్నారు. వర్షాభావం కారణంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగు కొంత ఆలశ్యంగా ప్రారంభమైంది. ఫలితంగా డిసెంబర్ నెలాఖరు వరకూ ఆయకట్టులోని 12005 ఎకరాలకు నీరివ్వాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రబీకి నీరు విడుదల చేయడం సాధ్యం కాదని అధికారులు మూడు రోజుల క్రితం జరిగిన జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో నిర్ణయించినట్టు ఈఈ రామ్‌గోపాల్ తెలిపారు.

పంపాలో 90 అడుగుల వద్ద నీటిమట్టం

ప్రస్తుతం పంపా రిజర్వాయర్‌లో 90 అడుగుల వద్ద నీటిమట్టం ఉంది. గరిష్ట నీటిమట్టం 103 అడుగులు. పంపాలో గరిష్ట నీటి నిల్వలు 0.43 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.09 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. పంపాలోకి ఇన్‌ఫ్లోస్ వంద క్యూసెక్కులు కాగా ఆయకట్టుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాగా గతేడాది ఇదే రోజుకు పంపాలో 101 అడుగుల నీటిమట్టం ఉండగా నీటి నిల్వలు 0.35 టీఎంసీలు ఉన్నాయి. గతేడాది కన్నా సుమారు నాలుగో వంతు మాత్రమే ఈ ఏడాది నీటి నిల్వలు ఉండడంతో రబీకి నీరు ఇవ్వలేమని ప్రభుత్వం ప్రకటించింది.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు కోట సుబ్రహ్మణ్యం, దత్తాత్రేయశర్మ, ఫణి శర్మ, చల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

జగ్గంపేట సీఐగా లక్ష్మణరావు



లక్ష్మణరావు

జగ్గంపేట: స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. లక్ష్మణరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న లక్ష్మణరావు గతంలో రాజమహేంద్రవరం జిల్లా పోలీసు కార్యాలయంలో పని చేశారు. ఇప్పటివరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన సూరి అప్పారావు జిల్లా కేంద్రంలో వీఆర్‌కు వెళ్లారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ లక్ష్మణరావుకు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ లబ్ధికి మళ్లీ జగనే సీఎం కావాలి



ధర్మవరంలో ఎమ్మెల్సీ రఘురాజుకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

తొండంగి/ప్రత్తిపాడు రూరల్: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంక్షేమ లబ్ధి కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగనే కావాలని విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న సంకల్పంతో విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొడ్డవర నుంచి ఈ నెల 8న పాదయాత్ర ప్రారంభించారు. శుక్రవారం ఈ పాదయాత్ర కాకినాడ జిల్లా బెండపూడికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. దేశమంతా మన రాష్ట్రం వైపు చూసే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వ్యవస్థలో చారిత్రాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి రాజకీయ విలువలకు వన్నె తెచ్చారన్నారు. కేంద్రంలో చట్టం చేయడానికి ముందే రాష్ట్రంలో అన్ని నామినేటెడ్ పదవులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేశారన్నారు. సామాజిక పరంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. పేదరికం లేని సమాజం కోసం నవరత్నాలతో పాటు పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్, రైతు భరోసా కేంద్రాలు వంటి వ్యవస్థలతో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందించారని తెలిపారు.

ధర్మవరం చేరిన పాదయాత్ర

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ విజయనగరం నుంచి తిరుపతికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మండలంలోని ధర్మవరం చేరుకుంది. ఈ పాదయాత్రకు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా దొరబాబు, గుడాల వెంకటరత్నం, బెంతుకుర్తి అబ్బాయి, గోళ్ల శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



గోవిందపురంలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రజా సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కామరాజుపేట, జగన్నాథపురం గ్రామాల్లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను ఎమ్మెల్యే ఎగురవేశారు. సచివాలయాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. అనంతరం కామరాజుపేట, జగన్నాథపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను, కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రూ.3 లక్షలతో నిర్మించిన సత్యసాయి జీఎల్ఆర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఎంపీటీసీ ఎం.బాబ్జి, స్థానిక నాయకులు శింబోతుల శ్రీను, శింబోతుల అచ్చిరాజు, ముమ్మన అర్జునరావు, పిడిం సతీష్‌కుమార్, ఎంపీడీఓ పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు త్వరలోనే కొండపోడు పట్టాలు

జగ్గంపేట: మండలంలోని గోవిందపురంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న కొండపోడు భూములకు త్వరలోనే పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోవిందపురంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, రూ.5 లక్షలతో నిర్మించిన కల్వర్టును ఎమ్మెల్యే చంటిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్గంపేట, గోకవరం మండలాల్లోని గిరిజనులు కొండపోడు పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి త్వరలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పట్టాలు అందిస్తామని తెలిపారు. నూతనంగా ప్రారంభించిన వెల్‌నెస్ సెంటర్లో రోగులకు మందుల పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే చంటిబాబును గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత జ్యోతుల రామస్వామి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ కిర్లంపూడి మండలాధ్యక్షులు దోమాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

- తప్పిన పెనుప్రమాదం
- స్వల్ప గాయాలతో బయటపడిన ప్రయాణికులు



జాతీయ రహదారిపై బెండపూడి వద్ద అదుపు తప్పి బోల్తా కొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

తొండంగి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానిక ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయరహదారిపై చిలకలూరిపేట నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. రెండు వాహనాలు విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే రహదారి దాటి 40 అడుగుల గోయిలో పడిపోయాయి. బస్సు బోల్తా పడటంతో ప్రయాణికులకు స్వల్పగాలయ్యాయి. లారీ డ్రైవర్, క్లీనర్ కూడా స్వల్పగాయాలతో బయటపడ్డారు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. రాత్రి సమయంలో ఒక్కసారిగా ప్రమాదం జరగడంతో బస్సులోని వారంతా ఏమి జరిగిందో తెలియక భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎవరికీ తీవ్రగాయాలు కాలేదని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కిర్లంపూడి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సైతం టెక్నాలజీపై అవగాహన పెంచుకునేందుకు ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేస్తోందని ఎంపీపీ తోట రవి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు బుద్ద రాంబాబు, కొసనం రాణి, నామ నాగరూపకు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, ఎంఈఓలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు, భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు జీవీఎస్ ప్రసన్న, నాయకులు పెనగంటి రాజేష్, సంఘన వెంకటేశ్వరరావు, మొల్లేటి వీరబాబు, నైదాన బాబ్జి, యల్లపు నానాజీ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ఏలేశ్వరం: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 26, వచ్చే నెల 3, 10 తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు ఏలేశ్వరం నుంచి బస్సులు పంచారామ క్షేత్రాలకు బయలుదేరుతాయన్నారు. సోమవారం రాత్రి 10 గంటలకు ఏలేశ్వరం ఆర్టీసీ డిపోకు బస్సులు తిరిగి వస్తాయని చెప్పారు. పెద్దలకు ఎక్స్‌ప్రెస్ రూ.840, ఆల్ట్రా డీలక్స్ రూ.1035, సూపర్ లగ్జరీ రూ.1075, పిల్లలకు ఎక్స్‌ప్రెస్ రూ.640, ఆల్ట్రా డీలక్స్ రూ.835 సూపర్ లగ్జరీ రూ.875గా టిక్కెట్ ధరలను నిర్ణయించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు

తుని: స్థానిక రోటరీ క్లబ్ యువజనోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తుని పట్టణం, రూరల్ ప్రాంతంలోని 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులను రోటరీ క్లబ్ ప్రోత్సహించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు వర్మ, ట్రెజరర్ గణేష్, యూత్ యాక్టివిస్టు చైర్మన్ డాక్టర్ పి.ప్రసాద్, రోటరీ, రోటరాక్ట్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

16 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్లు చేయించుకున్న రోగులకు పండ్లు అందజేసిన ఆసుపత్రి చైర్మన్ రవికుమార్ తదితరులు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట రాజేశ్వరి, రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాలలో లేజర్ ట్రీట్‌మెంట్ ద్వారా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి చైర్మన్ కొత్తపల్లి రవి కుమార్ తెలిపారు. నీలాద్రిరావుపేటలో రాజేశ్వరి, రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల పేరుతో కంటి ఆస్పత్రిని ఇటీవల పునఃప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా తొలివిడతలో 16 మందికి లేజర్ ట్రీట్‌మెంట్ అందించినట్టు రవికుమార్ తెలిపారు. గండేపల్లి, మల్లేపల్లి, జగ్గంపేట, తదితర గ్రామాల నుంచి వచ్చిన వారికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశామన్నారు. గతంలో కోత, కుట్లు వేసే పద్ధతిలో ఆపరేషన్లు చేసేవారమని, ప్రస్తుతం కార్పొరేట్ స్థాయిలో లేజర్ ట్రీట్‌మెంట్ అందిస్తున్నామన్నారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కొత్త కొండబాబు, ఆదిత్య ఆస్పత్రి వైద్యులు ఎంఎస్‌బీ గంగాధర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీవీ గంగాధర్, క్లబ్ సభ్యుడు కోడూరి శ్రీనివాస్, ఆస్పత్రి మేనేజర్ ప్రకాష్, ఇన్‌చార్జి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు



ఏలేశ్వరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ పాపారావు

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత జువ్విన వీర్రాజు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

45 మందికి కళ్లజోళ్ల పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎంపికైన 45 మందికి శుక్రవారం కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, వైఎస్సార్ సీపీ యూత్ లీడర్ రామిశెట్టి బులిరామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



శంఖవరంలో పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



కుమ్మరిలోవ తపోవనం పరిసరాల్లో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు



యర్రవరంలో పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం/తునిరూరల్/పత్తిపాడు/గండేపల్లి/కోటనందూరు/గోకవరం/శంఖవరం: తుని, పత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శుక్రవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. చవితిని పురస్కరించుకుని పొలాల్లో సందడి నెలకొంది. భక్తులు ఉదయాన్నే తలస్నానం చేసి పొలాల్లోని పుట్టల వద్దకు చేరుకున్నారు. నాగేంద్రునికి నువ్వులతో చేసిన చిమ్మిడి, పాలు, గుడ్లు పుట్టల్లో పోసి ప్రత్యేక పూజలు చేశారు. పుట్టల వద్ద బాణసంచా కాల్చారు. తమకు ఎటువంటి హాని తలపెట్టకూడదని రైతులు నాగేంద్రునికి మొక్కుకున్నారు. యర్రవరంలో పుట్ట వద్ద ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఏలేశ్వరం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పల్లె బాట పట్టిన భక్తులు

నాగుల చవితిని పురస్కరించుకుని తుని పట్టణానికి చెందిన వందలాది మంది భక్తులు నూతన వస్త్రాలు ధరించి గ్రామాల బాట పట్టారు. కుమ్మరిలోవ, తపోవనం ఆశ్రమం, చామవరం, ఎస్.అన్నవరం తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పూజలు చేశారు.

శంఖవరంలో ఎమ్మెల్యే పూజలు

శంఖవరంలోని తన పొలంలో పుట్ట వద్ద ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. గోకవరం మండలంలోని సింగారమ్మచింతకు భక్తులు పోటెత్తారు.

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళులు

ఏలేశ్వరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమానికి అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం విశేష కృషి చేశారన్నారు. ప్రతిఒక్కరూ పుస్తకపఠనం తప్పనిసరిగా చేయాలని సూచించారు. అనంతరం పట్టణంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సామంతుల భాస్కరరావు, రాజేశ్వరరావు, పాఠకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రోడ్ల స్థితిపై నిరసన

జగ్గంపేట: జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రణాళికలో భాగంగా జగ్గంపేట నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లను ఈ నెల 19 నుంచి పరిశీలించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహూ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. జగ్గంపేటలో గురువారం జరిగిన టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశంలో జనసేన నేత సూర్యచంద్రను వేదికపై నుంచి తోసేశారని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కుటుంబ సమస్యను తీసుకువచ్చి సూర్యచంద్ర గందరగోళం సృష్టించారని విమర్శించారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సుబ్బారావు ఉద్రేకంలో ముందుకు వస్తుండగా సూర్యచంద్రపై దాడి చేస్తారనే అనుమానంతో తన కుమారుడు జ్యోతుల నవీన్ కుమార్ సుబ్బారావును వేదిక పై నుంచి తోసివేశారని తెలిపారు.